క్లుప్తంగా

ఆన్‌లైన్ సేవలు ప్రారంభం



ఆన్‌లైన్ సేవలు ప్రారంభిస్తున్న ఎస్టీయూ నాయకులు

నంద్యాల (న్యూ టౌన్) : ఉపాధ్యాయ బదిలీల ఆన్‌లైన్ సేవలు స్థానిక కార్యాలయంలో ప్రారంభించినట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అజం బేగ్, మౌలాలి బుధవారం తెలిపారు. రాష్ట్ర సహాయ అధ్యక్షులు చంద్రశేఖర్, గోపాల కృష్ణ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ ముగిసేవరకు సేవలు కొనసాగుతాయని చెప్పారు. నాగేంద్ర కుమార్, వీరప్ప, రంగ స్వామి, నాగేశ్వర రెడ్డి, చంద్రశేఖర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన

ఉయ్యాలవాడ : మండలంలోని తుడుమలదిన్నె రైతు భరోసా కేంద్రంలో బుధవారం కౌలు కార్డులపై వ్యవసాయ ఏఈఓ వెంకటేశ్వరరెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. భూ యజమాని, సాగుదారుని మధ్య ఒప్పంద పత్రం మాత్రమేనని, దీని కాలపరిమితి కేవలం 11 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. కార్డులో భూ యజమాని సాగుదారుల పేర్లు, సర్వే నంబర్, విస్తీర్ణం ఉంటుందని,దీని వల్ల భూ యజమానికి హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని చెప్పారు. కార్డుపొందిన కౌలు రైతుకు వైఎస్ఆర్ రైతు భరోసా, పంటల బీమా, విత్తనాలు, ఎరువులు, పంట నష్ట పరిహారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాణెమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



వృద్ధురాలికి ఇంటి వద్ద వైద్యం చేస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రాంను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రమేష్ చంద్ర బాలాజీ కోరారు. స్థానిక 24 గంటల పీహెచ్‌సీ వైద్య బృందం బుధవారం మండలంలోని నర్సిపల్లె గ్రామానికి 104 వాహనం ద్వారా చేరుకొని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వైద్య శిబిరం నిర్వహించారు. 110 మందికి వివిధ రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం వృద్ధులు, దివ్యాంగుల గృహాల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి, సునీల్ బాబు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మాన్యం కౌలుకు వేలం

రుద్రవరం: మండలంలోని ఆలమూరులోని ఈశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాలకు చెందిన 48.11 ఎకరాల మాన్యం కౌలుకు ఈఓ లక్ష్మీనారాయణ బుధవారం వేలం నిర్వహించారు. రైతులు పోటా పోటీగా వేలం పాడటంతో గతేడాది కంటే ఆదాయం బాగా పెరిగింది. గతేడాది రూ.5,31,500 రాగా ఈ ఏడాది రూ.9,21,500 లభించిందని, గతేడాది కంటే రూ.3,90,500 అదనంగా సమకూరిందని ఈఓ చెప్పారు. ఆలయ ధర్మకర్త శూలం ప్రభాకర్, పాణ్యం చంద్ర, నాగేష్, పత్తి బ్రహ్మయ్య, పత్తి లక్ష్మీనారాయణ, జయరాముడు పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరు గ్రామంలో ఇండ్ల ప్రసాద్ అనే రైతుకు చెందిన గడ్డివామి బుధవారం దగ్ధమైంది. ప్రమాదవశాత్తు రూ.50 వేల విలువజేసే పశుగ్రాసం కాలి బుడిదైంది. స్థానికులు వచ్చి మంటలార్పటానికి ప్రయత్నించినా అదుపులోకి రాకపోవడంతో, సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ అగ్నిమాపకదళ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఘర్షణ.. కేసు నమోదు

రుద్రవరం: మండలంలోని ముత్తలూరు గ్రామంలో స్థలం విషయంలో చోటుచేసుకున్న ఘర్షణలో సుందరరామిరెడ్డి అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన ఉశేన్, మురారి అనే ఇరువురు దాడి చేసి గాయపరిచారని ఏఎస్ఐ భూపాల్ రెడ్డి తెలిపారు. ఉశేన్, మురారి ఇద్దరూ కలిసి సుందర రామిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి స్థలం విషయంపై చర్చిస్తుండగా మాటా మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో సుందరరామిరెడ్డిపై దాడి చేశారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపడితే సీమలో కరువు నిర్మూలించవచ్చని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి తెలిపారు. ఈ నెల 31న జరగనున్న సిద్దేశ్వరం జల జాగరణ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. దీక్ష విజయవంతం కోరుతూ నంద్యాల మండలంలోని అయ్యలూరు, చాబోలు, మిట్నాల, పాండురంగాపురం, చాపిరేవుల గ్రామాల్లో బుధవారం పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, చిన్నతిరుపతిరెడ్డి, త్రిలింగేశ్వరరెడ్డి, తులసీశ్వర రెడ్డి పాల్గొన్నారు.

విత్తుకు రక్ష.. పరాన్నజీవులకు శిక్ష

- భూ సంక్రమిత తెగుళ్లకు విత్తనశుద్ధితో చెక్
- మొలక శాతం పెరుగుదలతో అధిక దిగుబడులు
- తగ్గనున్న పెట్టుబడి వ్యయం
- ఏరువాక కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సరళమ్మ



బిలకలగూడూరులో సోయాబీన్ విత్తనాన్ని శుద్ధి చేస్తున్న మహిళలు

నంద్యాల(సెంట్రల్): అన్నదాతలు విత్తనాల నాణ్యతపై ఎంత శ్రద్ధ చూపుతారో...విత్తిన తర్వాత ప్రారంభ దశలో పరాన్నజీవుల (పురుగులు, శిలీంద్రాల వంటివి)తో ఉత్పన్నమయ్యే తెగుళ్లపై అంతే దృష్టి పెట్టాలంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. పంట కోతల అనంతరం, భూమిలో మిగిలిపోయిన పలు చీడపీడల అవశేషాలు తదుపరి సాగుపై తీవ్ర ప్రభావం చూపటంతో పాటు దిగుబడిని తగ్గించే ప్రమాదముంది. దీంతో అరకొర దిగుబడులు లభిస్తాయంటున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాలంటే విత్తనశుద్ధి కీలకమని, బీజానికి రక్షణ కవచంలా నిలిచే ప్రక్రియపై పలు సూచనలు చేశారు.

మూడు దశల్లో శుద్ధి ప్రక్రియ..

నేలలోని పురుగులు, కంటికి కనిపించని శిలీంద్రాల బారి నుంచి విత్తనాలను కాపాడుకోవటంలో విత్తనశుద్ధి ఎంతో కీలకం. విత్తన శుద్ధి చేసేటప్పుడు ముందుగా కీటకనాశిని మందులతో శుద్ధి చేయాలి. అనంతరం నీడలో ఆరబెట్టి శిలీంద్రనాశక రసాయనాలతో శుభ్రపరచాలి. చివరగా జీవ ఎరువులతో శుద్ధి చేసి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి. మార్కెట్లో లభించే విత్తనాలు శుద్ధి చేసినవే అని చెప్పినా...రైతులు విధిగా బీజ శుద్ధి చేసుకోవాలి. రెండోసారి శుద్ధి చేస్తే దిగుబడులు తగ్గుతాయనే అపోహ అవసరం లేదు. పైపెచ్చు మొలకశాతం గణనీయంగా పెరిగి అధిక దిగుబడులు సాధించటానికి ఆస్కారమేర్పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

విత్తన శుద్ధి పద్ధతులు..

వరి..

కిలో విత్తనానికి 3గ్రాముల కార్బండిజమ్ 50 శాతం మందును కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి గ్రాము చొప్పున 50 శాతం కార్బండిజం కలిపి, అందులో 24 గంటలు నానబెట్టి, ఒకరోజు మండెకట్టి మొలకెత్తిన విత్తనాన్ని చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టటానికి లీటరు మందు నీరు సరిపోతుంది. కార్బండిజం 25 శాతం, మాంకోజెబ్ 50 శాతం మిశ్రమ శిలీంద్ర నాశినిని వాడితే 2 గ్రాములు కిలో విత్తనానికి, లీటరు నీటికి వంతున వాడాలి.

మొక్కజొన్న..

కిలో విత్తనానికి 3 గ్రా. మాంకోజెబ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకున్నట్‌లైతే లేత దశలో తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చు. కత్తెర పురుగు నివారణకు కిలో విత్తనానికి 6గ్రా ఫోర్టెంజో డ్యూయో కలిపి శుద్ధి చేసుకోవాలి.

జొన్న..

కిలో విత్తనానికి 3గ్రాముల కాప్టాన్ కలిపి విత్తన శుద్ధి చేయాలి. మొవ్వు ఈగ నివారణకు కిలో విత్తనానికి 3గ్రా. థయోమిథాగ్జమ్ కలిపి ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు.

మినుము–పెసర..

పంట విత్తుకునే 24–48 గంటల ముందుగా కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్. ఎస్(గాచో) 5 మి.లీ. లేదా థయోమిథాక్సిమ్ 70 డబ్ల్యూ. ఎస్(క్రూజర్) 5 గ్రా, కార్బన్‌డిజమ్ లేదా మాంకోజెబ్ 2.5 గ్రా కలిపి శుద్ధి చేయాలి.

శనగ..

కిలో విత్తనానికి 2.5 కాప్టాన్ లేదా 3 గ్రా కార్బెండిజమ్ లేదా 10 గ్రా ట్రైకోడెర్మ విరిడి లేదా 1.5 గ్రా వైటవాక్స్‌తో శుద్ధి చేయటం ద్వారా ఎండు, వేరుకుళ్లు నుంచి రక్షించుకోవచ్చు.

పత్తి..

పత్తిలో రసం పీల్చే పురుగుల తాకిడి ఎక్కువ. మార్కెట్లో లభించే బీటీ విత్తనం శుద్ధి చేసినదే దొరుకుతోంది. నాన్ బీటీ సాగు చేసే రైతులు కిలో విత్తనానికి తగినంత జిగురు కలిపి 5గ్రా ఇమిడాక్లోప్రిడ్ లేక 4గ్రా థయోమిథాగ్జమ్‌తో విత్తనశుద్ధి చేసి విత్తితే 40–45 రోజుల వరకు రసం పీల్చే పురుగుల నుంచి రక్షించవచ్చు. తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 2గ్రా కార్బండిజమ్ లేదా 2గ్రా కార్బోక్సిన్ లేదా 10 గ్రా ట్రైకోడెర్మవిరిడితో విత్తనశుద్ధి చేయాలి.

మిరప..

కిలో మిరప విత్తనానికి వైరస్ తెగుళ్ల నివారణకు 8గ్రా ఇమిడాక్లోప్రిడ్, ఇతర తెగుళ్ల నివారణకు 3గ్రా. కాప్టాన్ లేదా 3గ్రా. మాంకెజెబ్ కలిపి శుద్ధి చేసుకోవాలి.

ద్రవరూప జీవన ఎరువులు..

అజటోబ్యాక్టర్ 200 మి.లీ ను 5–10 లీటర్ల నీటిలో కలిపి నాటే ముందు అరగంట వరకు ద్రావణంలో ముంచి నాటుకోవాలి.

ప్రత్యేక శ్రద్ధ అవసరం

జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 2.28 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధాన పంటల్లో వరి మినహా మొక్కజొన్న, పత్తి, జొన్న, కంది, మినుము, శనగ, పొద్దుతిరుగుడులో నేల ద్వారా వ్యాపించే తెగుళ్లు ఎక్కువగా ఉంటున్నాయని అధికారులు గుర్తించారు.

అవగాహన అవసరం



అన్నదాతలు విత్తనశుద్ధిని విధిగా పాటించాలి. తెగుళ్లు సోకిన తర్వాత పిచికారీ చేసే మందుల ఖర్చులో 10 శాతం మాత్రమే ఖర్చవుతుంది. ఏరువాక కేంద్రం తరఫున ఈ అంశంపై రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. త్వరలో గ్రామస్థాయి నుంచి వ్యవసాయాధికారులతో సమన్వయం చేసుకుని అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

– డా.ఎస్. సరళమ్మ, కార్యక్రమాల సమన్వయకర్త, ఏరువాక కేంద్రం, నంద్యాల

నేడు వలంటీర్లకు సన్మానం

దొర్నిపాడు: స్థానిక సొసైటీ ఆవరణలో గురువారం 117 మంది ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సన్మానిస్తారని ఎంపీడీఓ నాగఅనసూయ బుధవారం తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లను దొర్నిపాడుకు వచ్చేలా సమాచారం ఇవ్వాలని సూచించారు. శాలువా, పూలదండతో పాటు ప్రశంసా పత్రంతో పాటు మెడల్‌తో సత్కరించిన అనంతరం వారి వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమజేస్తారని చెప్పారు. వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

ఎస్డీజీ సర్వేలో పురోగతి సాధించాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని వార్డు సచివాలయాలల్లో విధులు నిర్వహించే సిబ్బంది నిర్ణీత గడువులోపు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ) సర్వేలో పురోగతి సాధించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న జిల్లా కలెక్టర్ సర్వేపై నిర్వహించిన సమీక్షలో పట్టణంలో పురోగతి సాధించాల్సి ఉందని చెప్పారన్నారు. ముఖ్యంగా 0–5 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు జనన ధ్రువ పత్రాలు లేనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా వివరాలను అన్ని సచివాలయాలకు సమాచారం పంపామని, జనన ధ్రువ పత్రాలు లేని వారిని గుర్తించి సచివాలయ శానిటరీ సెక్రటరీలు పత్రాలు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అసంఘటితరంగ కార్మికులకు అడ్మిన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు ఈ–శ్రమ్ కార్డులకు రిజిస్ట్రేషన్ చేయించాలని, అమెనిటీస్ సెక్రటరీలు హౌసింగ్ ఈ–కేవైసీ చేయాలని ఆదేశించారు. పట్టణానికి సంబంధించి సుమారుగా 127 మంది లబ్ధిదారుల ఈ- కేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. హెల్త్ సెక్రటరీలు ఆయుష్మాన్ భారత్ పీఎంజేపై సర్వే 63శాతం మాత్రమే పూర్తి అయ్యిందన్నారు. పట్టణంలోని 21,234 మందికి ఆయుష్మాన్ పీఎంజే పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

పాడి రైతులకు సహకారం



మాట్లాడుతున్న ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి

రుద్రవరం: పాడి రైతుల అభివృద్ధికి విజయ డెయిరీ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని చైర్మన్ ఎస్వీ జగన్‌మోహనరెడ్డి తెలిపారు. మండలంలోని మాచినేనిపల్లె, చందలూరు గ్రామాల్లో బుధవారం లేగ దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. కృత్రిమ గర్భధారణ వల్ల కలిగే లేగ దూడలను జాగ్రత్తగా చూసుకోవాలని, కృత్రిమ గర్భధారణకు అయ్యే ఖర్చు డెయిరీనే భరిస్తుందని చెప్పారు. ఇప్పటికే పాడి రైతులకు లీటరుకు రూ.2 ప్రకారం బోనస్ అందజేస్తున్నామన్నారు. అనంతరం రైతులకు బహుమతులు, లేగ దూడల ఆరోగ్య సంరక్షణకు అవసరమైన మందులు అందజేశారు. ఏపీఎల్‌డీఏ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్,అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్న,రాజశేఖర్‌రెడ్డి, ప్రాంతీయ వెటర్నరీ డాక్టర్ మనోరంజన్ ప్రతాప్, విజయ డెయిరీ డైరెక్టర్ రాజేష్,జయసూర్య పాల్గొన్నారు.

నానో డీఏపీతో రైతులకు పెట్టుబడి ఆదా



మాట్లాడుతున్న పీపీ నాగిరెడ్డి

గోస్పాడు: నానో డీఏపీతో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గే అవకాశం ఉందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని దీబగుంట్ల సొసైటీ ఆవరణలో బుధవారం ఇఫ్‌కో రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలాన్ని బట్టి రైతులు వ్యవసాయంలో కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. నానో డీఏపీ వల్ల రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మార్కెట్‌లో బస్తా డీఏపీ ధర రూ.1,300 ఉందని అందుకు సమానంగా పనిచేసే నానో డీఏపీ 500ఎంఎల్ ధర ఇఫ్‌కో వారు రూ.600కే ఇస్తున్నారని చెప్పారు. జిల్లావ్యవసాయ అధికారి మోహన్‌రావు, మార్కెట్ డీఎం నాగరాజు, ఏడీఏలు రామ్మోహన్‌రెడ్డి, రాజశేఖర్, ఏఓ అయూబ్‌బాషా, జిల్లా ఆగ్రోస్ మేనేజర్ సుధీర్‌రెడ్డి, జిల్లా ఇఫ్‌కో మేనేజర్ మధు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



ఆర్.కొత్తూరులో బండలాగుతున్న ఎద్దులు

రుద్రవరం: మండలంలోని ఆర్.కొత్తూరులో నూతనంగా నిర్మించిన పట్టాభి రామస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవ వేడుకలు శాస్త్రోక్తంగా సాగుతున్నాయి. రెండో రోజు బుధవారం వేద పండితులు ప్రాతఃకాల పూజతో ప్రారంభించి యంత్రాభిషేకం,ఆవాహిత దేవతా హోమాలు, మండపారాధన, ఆదిత్యాది నవగ్రహ అష్ట దిక్పాలక, మన్యు సూక్త హోమాలు, ధాన్యాధి, పుష్పాధి వాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామ పెద్దలు ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. మొత్తం 19 జతల ఎద్దుల పాల్గొనగా విజేతలకు వరుసగా రూ.30వేలు, రూ.25వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

అసంక్రమిత వ్యాధుల సర్వే పూర్తి చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: డయాబెటిస్, హెపటైటిస్ తదితర అసంక్రమిత వ్యాధుల సర్వే వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. హైరిస్క్ కాన్పులు, సిజేరియన్ కాన్పులను ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. సాధారణ కాన్పులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా చేపట్టాలని కోరారు.



ఇంజేడు కుంటలో సేదదీరుతున్న బర్రెలు

వేసవి తాపం తాళలేక..



క్రిష్టిపాడు వద్ద కుందూనదిలో చిన్నారుల ఈత సరదా

దొర్నిపాడు/ఉయ్యాలవాడ : భానుడి ప్రచండ రూపానికి జనం, పశు పక్ష్యాదులు బెంబేలెత్తుతున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు మండుతున్న ఎండ ధాటికి బయటకు రాలేని పరిస్థితి. నాలుగు రోజులుగా 42 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు వివిధ మార్గాలను అనుసరిస్తున్నారు. ముఖ్యంగా నదీ తీర ప్రాంతాల్లో చిన్నారులు నదిలో ఈత కొడుతున్నారు. ఇక పశువులు మాత్రం నీటి కుంటల్లో సేదదీరుతున్నాయి. పశుపోషకులు మతే కోసం తీసుకెళ్తే ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో కుంటల్లో వదులుతున్నారు. లేకపోతే పాల ఉత్పత్తి తగ్గిపోతుందని చెబుతున్నారు. కాగా.. అత్యవసరమైతేనే బయటకు రావాలని, లేకపోతే ఇంటిపట్టునే ఉండాలని డాక్టర్ నాగేంద్ర సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సాయంత్రం 4 గంటల వరకు పశువులను నీటిలో ఉంచడం మంచిదని పశు వైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



పథకాల బుక్‌లెట్‌ను మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

శిరివెళ్ల: ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పునరుద్ఘాటించారు. బుధవారం స్థానిక 3వ గ్రామ సచివాలయ పరిధిలోని 11,12 వార్డులు పసుల పేట, రెడ్డి పేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. బి.అబ్దుల్ సలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, హిస్టరీ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ హఫీజ్, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, వీరారెడ్డిపల్లె సర్పంచు శివారెడ్డి,ఆర్యవైశ్య సంఘం రాయకులు సముద్రాల సత్యనారాయణ శ్రేష్ఠి, వంకధార సుబ్బసత్యనారాయణ శ్రేష్ఠి, నాదేళ్ల నాగరాజు, నాయకులు ముల్లా అన్వర్‌భాషా, దొర్నిపాటి రఫీ, ముడి మేల నాగరాజు, రిటైర్డ్ ఎంఈఓ మహబూబ్ భాషా, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి పాల్గొన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంగులబిజేంద్రారెడ్డి

వలంటీర్ల సేవలు అభినందనీయం

ఆళ్లగడ్డ: సచివాలయ వ్యవస్థలో గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. బుధవాదరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 392 మంది వలంటీర్లను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రజల ముంగిటకే పాలన నిమిత్తం గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను అమలు చేస్తుందన్నారు. వలంటీర్లు సచివాలయ ద్వారా 360 ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీలో వలంటీర్ల పనితీరును ప్రజలందరూ కొనియాడుతున్నారన్నారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ నాసారి నరసింహప్రసాద్, దాదాపీర్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, నాయకులు రామ్మోహన్ రెడ్డి, విజయ్‌యచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా..వేతనం కోత

నంద్యాల(సిటీ): విధుల్లో అలసత్వం వహిస్తున్న సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని పలు సచివాలయాలను తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొట్టిన 30వ వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి ఒక్కరోజు వేతనం కోత విధించారు. సచివాలయాల్లో మధ్యాహ్నం సిబ్బంది విధుల్లో ఉండటం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో 30, 32 సచివాలయాలను పరిశీలించగా 30వ సచివాయంలో ప్లానింగ్ సెక్రటరీ ముందస్తు సమాచారం లేకుండా క్యాజువల్ లీవ్ పెట్టినట్లు అడ్మిన్ తెలిపారన్నారు. పలుమార్లు ఇలా రిజిస్టర్‌లో నమోదు చేయకుండా సెలవులపై వెళ్లినట్లు తమ దృష్టికి రావడంతో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఆధునిక చికిత్స విధానాలపై అవగాహన

నంద్యాల టౌన్ : రక్త నాళాల శస్త్ర చికిత్సలో ఆధునిక విధానాలు అనే అంశంపై బుధవారం స్థానిక సూరజ్ హోటల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నంద్యాల ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అజయ్ మాట్లాడుతూ రక్తనాళాలలో వచ్చే జబ్బులకు, షుగర్ వ్యాధి వల్ల పాదాలలోని రక్తనాళాలలో వచ్చిన మార్పుల కారణంగా పాదం తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడినప్పటికీ రక్త నాళాల ఆధునిక శస్త్ర చికిత్సల ద్వారా రోగి పాదం తొలగించకుండా కాపాడవచ్చని తెలిపారు. ప్రమాదంలో రక్తనాళాలు తెగినపుడు కూడా సత్వర, ఆధునిక విధానాల ద్వారా వాటిని సరిచేసి ఆయా అవయవాలకు తిరిగి రక్తం సరఫరా అయ్యే విధంగా వాస్కులర్ సర్జరీలో అవకాశం ఉందని వివరించారు. రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరెడ్డి, అనిల్ కుమార్, కిమ్స్ హాస్పిటల్ వైద్యులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ సద్వినియోగం చేసుకోండి

ఆళ్లగడ్డ: పొలాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న కౌలు రైతులు సీసీఆర్సీ (కౌలు రైతు కార్డు) కార్డులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బత్తలూరు ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కౌలు రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అన్ని ఆర్బీకేల్లో కౌలు రైతులకు సీసీఆర్సీ ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి కౌలు రైతు అర్హత పత్రం పొందాలని సూచించారు.

కౌలు రైతులకు సాయం చేయవచ్చు

నంద్యాల (అర్బన్): పంట సాగుదారుల హక్కు చట్టం–2019 ద్వారా భూ యజమాని హక్కులకు నష్టం జరుగకుండా కౌలు రైతులకు సాయం చేయవచ్చని నంద్యాల మండల వ్యవసాయ అధికారిణి స్వప్నికారెడ్డి తెలిపారు. మండలంలోని చాబోలు గ్రామ ఆర్బీకేలో బుధవారం కౌలు రైతులకు పంట సాగు హక్కు ధృవపత్రం (సీసీఆర్సీ)పై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో కౌలు రైతులకు 815 కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో 97 మంది కౌలు రైతులను గుర్తించామని చెప్పారు. డీఆర్సీ మంజువాణి, వీఆర్ఓ శ్రీరాములు పాల్గొన్నారు.

సీసీఆర్సీ సద్వినియోగం చేసుకోండి

ఆళ్లగడ్డ: పొలాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న కౌలు రైతులు సీసీఆర్సీ (కౌలు రైతు కార్డు) కార్డులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బత్తలూరు ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కౌలు రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అన్ని ఆర్బీకేల్లో కౌలు రైతులకు సీసీఆర్సీ ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి కౌలు రైతు అర్హత పత్రం పొందాలని సూచించారు.

'రెమిడియల్'.. సువర్ణ అవకాశం

- పది ఫెయిలైన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు
- సబ్జెక్టు వారీగా ప్రత్యేక తరగతులు
- జూన్ 2న సప్లిమెంటరీ పరీక్షలు



ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాలలో రెమిడియల్ క్లాస్ నిర్వహిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయిని రోహిణి

ఉయ్యాలవాడ : విద్యార్థి దశలో 10వ తరగతి ఒక మైలు రాయిలాంటిది. ఇటీవల వెల్లడైన పది ఫలితాల్లో పలువురు విద్యార్థులు ఫెయిలయ్యారు. వారందరినీ ఆ మైలురాయి దాటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జూన్ 2న నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. రెమిడియల్ తరగతుల్లో భాగంగా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను చదివిస్తున్నారు. మండలంలో 5 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీతో పాటు మోడల్‌స్కూల్‌ను కలిపి మొత్తం 353 మంది విద్యార్థులు పరీక్షల రాయగా వీరిలో 216 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, 137 మంది ఫెయిల్ అయ్యారు. వారికి కోసం ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆయా పాఠశాలల్లో రెమిడియల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. వీరందరూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఇంటర్ చదువుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తుంది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

సబ్జెక్టుల వారీగా తరగతులు



మా పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు 35 మంది విద్యార్థులు హాజరవగా 14 మంది ఉత్తీర్ణత సాధించగా 21 మంది ఫెయిల్ అయ్యారు. ఎక్కువ శాతం గణితం, సైన్స్‌లో తప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన రెమిడియల్ తరగతుల కార్యక్రమంలో భాగంగా ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రతి రోజూ సబ్జెక్టుల వారీగా టైమ్ టేబుల్ వేసుకుని తరగతులు నిర్వహిస్తున్నాం.

– వెంకటశకుంతల, హెచ్‌ఎం, ఉన్నత పాఠశాల, ఉయ్యాలవాడ

తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలలకు పంపాలి



మా పాఠశాలలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 29 మంది ఫెయిల్ అయ్యారు. ఇందులో కొందరు విద్యార్థులు మాత్రమే రెమిడియల్ క్లాస్‌లకు హాజరవుతున్నారు. ప్రతి రోజూ విద్యార్థులకు ఫోన్ చేసి చెబుతున్నాం. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి పిల్లలను తరగతులకు హాజరయ్యేలా చూడాలి.

– శోభన్‌బాబు, సోషియల్ అధ్యాపకుడు, మోడల్‌స్కూల్, ఉయ్యాలవాడ